# ఆడదాని కథ

"అమ్మోయ్! నీకు ఆకాశవాణినుంచి పిలుపొచ్చింది" అంటూ ఓ కవరు విసిరింది మా అమ్మాయి.

నా గుండె గుభేల్మంది.

బహుశా "నిన్ను చంపబోయేవాడు మీ చెల్లి కడుపున పుడతాడు" అన్న ఆకాశవాణికూడా కంసుడు అంత భయ పడి ఉండడు.

పిల్ల పుట్టాలంటే తొమ్మిది నెలలు చాలు. కాని నా కథలు మాత్రం బుర్రలో అలా కొన్ని సంవత్సరాలుంటాయి. ఈ మధ్యలో బుర్రకి సిజేరియన్ చేసినా, బుర్ర పగుల్తుందే తప్ప కథ బయటకి రాదు. కొన్నాళ్ళపాటు నా కథలు కేవలం ప్రత్యేక సంచికల్లోనే వచ్చేవి. కారణం ఏమిటంటే ఈ ఏడాది ప్రత్యేక సంచికకి కథ రాయడం మొదలుపెడితే, అది వచ్చే ఏటికి పూర్తి అయ్యేది. మళ్ళీ ఆ వచ్చే ఏటి కథ మొదలు పెడితే అది ఆపై ఏటికి అందేది, ఈవేళ టైముకి వచ్చిన రైలు నిన్నటిది అన్న జోక్‌లాగ.

రావలసిన టైముకి రాకుండా హార్ట్ ఎటాక్ నైనా ఆపుకోవచ్చునేమోగాని, రేడియో వాళ్ళకి మాత్రం టైముకి కథ రాయడం తప్పించుకోలేం. ఆలోచించినకొద్దీ బి. పి. పెరిగిందే తప్ప ప్లాటు తట్టలేదు. కథకి ప్లాట్ సంపాదించడంకంటే, హైదరాబాద్‌లో ప్లాట్ సంపాదించడం సులువనిపించింది. ఏం చెయ్యాలో తోచక 'కథలు రాయడం ఎలా?' అన్న పుస్తకం

లైబ్రరీనుంచి తెప్పించి చదివేను. అందులో వ్యాసాలన్నీ ప్రఖ్యాత రచయితలు రాసినవే. అవన్నీ చదివేక కథకి ప్లాట్ మాటెలా ఉన్నా, భయం పట్టుకుంది, ఇంతవరకు నేను రాసిన వన్నీ కథలేనా అని.

ఏ యిద్దరు రచయితలూ ఏకీభవించరన్నది కేవలం సామెతే! కారణం ఏమంటే ఈ ప్రఖ్యాత రచయితలందరూ కూడబలుక్కున్నట్టు కథకి శిల్పం ఉండాలి అని నిశ్చయించేశారు. అయితే ఆ శిల్పం ముక్కెంత పొడవుండాలో, మూతి ఎంత వెడల్పుండాలో మాత్రం ఎవరూ చెప్పలేదు.

ఇంతకీ విత్ ఆర్ వితౌట్ శిల్పం ఇప్పుడు కథ రాయక తప్పదు. మన దగ్గర లేనప్పుడు పక్కవాడిని అప్పో, అరువో అడగొచ్చు, ఒక్క పెళ్ళాం మినహా. మరంచేత అవమానం అనుకోకుండా నేను మా పిల్లలందర్నీ అడిగేసేను - "ఏదైనా ప్లాట్ చెప్పండర్రా" అని.

"చక్కటి ఇంగ్లీషు డిటెక్టివ్ కథ ఒకటి తెనిగించు" అన్నారు నా కూతుళ్ళు, 'ఎలిస్టర్ మేక్లీన్' లోంచి ఒకరు, 'ఛేజ్' లోంచి ఒకరు బుర్ర పైకిపెట్టి.

"బ్రహ్మాండమైన క్రికెట్ కథ రాయి" అన్నారు నా సుపుత్రులు బేట్లు ఊపుకుంటూ.

మొదటిది నా కిష్టంలేదు. రెండోది నాకు తెలీదు. మరంచేత "అన్యథా శరణం నాస్తి" అని మావార్ని పట్టుకున్నాను- మార్కండేయుడు శివుడ్ని పట్టుకున్నట్టు.

ఐతే మార్కండేయుడికీ, నాకూ భక్తి ఒక్కటే తేడా.

"కథా!" అన్నారు మా వారు "ఖూనీనా" అన్నంత ఆశ్చర్యంగా. "అవును-కథే" అన్నాను.

"ఛుం" అన్నారు తనే. నేనేం అనలేదు.

"నేను కథ చెప్తే నువ్వు క్రెడిట్ కొట్టేస్తావా?" అన్నారు తన ఆస్తి నేనేదో అన్యాయంగా అనుభవించేస్తున్నట్టు.

"సరిగ్గా ఆ మాటే అంటున్నారు అందరూ. వచ్చిన నింద ఎలాగా వచ్చింది. మరింక అనవసరంగా నేనెందుకు కష్ట పడాలి?" అన్నాను.

"నువ్వు అసలు స్త్రీ జాతికే తీరని అవమానం" అన్నారు.

అయితే అయ్యేను కాని కథ చెప్పమన్నాను.

"ప్రస్తుతం దేశంలో సారస్వత లోకాన్ని ఎవరేలు తున్నారు?" స్త్రీలు.

"సినీమా ప్రపంచాన్ని ఎవరుద్ధరిస్తున్నారు?" స్త్రీలే.

ఎవార్డు లెవరివి? ఇంకెవరివి? ఆడవాళ్ళవే.

వారపత్రికల మహారాజ పోషకు లెవరు? వనితలే.

మాసపత్రికల రాజ పోషకు లెవరు? మగువలు.

అలాంటి స్త్రీ జాతిలో పుట్టి అష్టరాల్ ఒక కథ రాయ లేక పోతున్నావంటే..."

"కథ చెప్పండి" అన్నాను కన్నంపడ్డ రికార్డులాగా.

"దసరా మామూలు వాళ్ళలా, ఎల్. ఐ సి. ఏజెంటులా పట్టుకుంటే వదలవు. ఖర్మ...సరే, రాసుకో...ఓ ఖరీదైన కుర్రాడుంటాడు. వాడోనాడు ఏదో పుస్తకంలో పల్లెటూళ్ళే భారతదేశపు వెన్నెముకలని చదివినవాడై, ఆ ఎముకలెలా ఉంటాయో చూడాలన్న కోరికతో, తన ఖరీదైన కార్లో పక్క-నేవున్న పల్లెటూళ్ళే వెళ్ళాడు..."

"ఏం పాపం! ఆ కుర్రాడికి చదువు, ఉద్యోగం వగైరా లేం లేవా!" డౌటు వచ్చింది నాకు.

"ఛీ-ఛీ. కాళిదాసు కూడా మూడ్ పాడుచేసేస్తావు. కథకి అడ్డు రాకుండా చెప్పింది విను...వెళ్ళి ఆ తరవాత ఏం చెయ్యాలో తోచక కాలక్షేపానికి క్లోజప్పులో ఒక పల్లెపడుచుని ప్రేమించి, లాంగ్‌షాట్‌లో వెళ్ళిపోతాడు. ఆ అమ్మాయి నెల తిరక్కుండానే నెలతప్పి, ఆ మాజీ ప్రియుడ్ని వెతుక్కుంటూ పట్నం వెళ్తుంది. వాడెక్కడా దొరకడు. ఆ అమ్మాయి "ఛీ-ముష్టి మొగాళ్ళు" అని తిడుతుంది. మరింక ఏం తిట్టాలో తోచక, కసి కొద్దీ కాల్‌గర్ల్ అయిపోతుంది..."

ఒళ్లు మండిపోయింది నాకు. ఇది కథా? సినీమానా?

"సర్వ కథలూ సినీమా గచ్ఛంమితి" అన్నారు ఆయనే. ఆయన చిన్నప్పుడు హైస్కూల్లో సంస్కృతం చదివేడు, పెద్దయ్యాక వేదాలన్నీ వెనకనించి నమిలేద్దామని. ఫలితంగా ఇటు సంస్కృతమూ రాలేదు, అటు తెలుగూ అబ్బలేదు.

"అంచేత పెన్నుని ఎప్పుడూ సినీమాకే గురిపెట్టు. ఏ తల మాసినవాడో తియ్యకా పోడు. ఆనక వాడికి గుండు అయిపోకా తప్పదు. అఫ్‌కోర్స్-ఎవరి తలరాత ఎవరు రాస్తారో చెప్పలేం అనుకో...అన్నట్టు ఈలోగా ఆ హీరోయిన్‌కి ఓ కూతురు పుడుతుంది. నాకు కోర్టుకి క్లైమైపోయింది. మరంచేత యింతవరకు మసాలా కలిపి రాయి. ఆ కూతురు గుంటనేం చెయ్యాలో సాయంకాలం ఆలోచిద్దాం" అంటూ లేచి వెళ్ళిపోయేరు.

"నా పెన్నేదర్రా?" మా వారిమీద కోపం ఆ కేకే చెపుతుంది. "ఛిన్ని పట్టుకెళ్ళాడు" అంది చిన్నది.

"మరి వాడిదేమైంది?" "పార్వతి దగ్గరుంది."

"దాన్ది?" "నేను వాడుతున్నాను"

"మరి నీది?" "పోయింది."

ఈ పేదరాశి పెద్దమ్మ కథకి పిచ్చెక్కిపోయింది.

"ఏదో ఒకటి యిలా తగలెయ్యి!" అరిచేను.

తగలేసింది.

ఈ పూటెలాగైనా సరే కథ రాస్తేకాని కదలదల్చుకోలేదు. మంచంమీద మఠం వేసుక్కూర్చున్నాను. పెన్ను మూత తియ్యడం, నా చీర, తెల్ల కాయితాలు సిరాతో స్నానం చెయ్యడం, నేను పెన్ను విసరడం-అన్నీ అరక్షణంలో జరిగేయి.

"ఛ త్తెరి! వెధవ దరిద్రం. ఎన్ని పెన్నులు కొన్నా సంతకం పెడదామంటే పెన్నుండదు. మళ్ళీ యింట్లో అందరూ స్టూడెంట్లే ఇంకీ ఇల్లు బాగుపడదు. పెన్నునికూడా పెట్లోపెట్టి ఎంతకని దాచుకుంటా?" నా సణుగుడు పూర్తి కాకుండానే-"అంట్లెయ్యండి, పొద్దెక్కి పోనాది" అంటూ అమ్మ వారిలా ఎదురుగా నిలుచుంది పనిమనిషి.

కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ అయినా బతిమాలితే కాస్సేపు ఆగుతుందేమో కాని, మా పనిమనిషి మాత్రం అర నిమిషం ఆగదు. అంట్లు దానికి, పెన్ను మా చిన్న దానికి పడేసి మళ్ళీ మంచం ఎక్కాను - ఇల్లంతా వెతగ్గా వెతగ్గా దొరికిన ఓ పెన్సిలు ముక్క పట్టుకొని. అసలా అరంగుళం పెన్సిలు దొరక్కపోతే, ఈ వేళ మసిబొగ్గుతోనైనా సరే రాసెయ్యాలన్నంత ఉక్రోషంగా ఉంది. రాసేద్దును కూడా.

ఇంతలో ... "పాలకు డబ్బులు..." ఎదురుగా జెండా కర్రలా నిల్చున్నాడు జవాను,

ప్రపంచం తిరగబడిపోయినాసరే, ఒక అరగంటవరకూ ఆగమన్నాను. ప్రపంచం సంగతి తనకి తెలీదట. కాని పాల వేను మాత్రం వచ్చేసిందట. ఆగడానికి తనకేం అభ్యంతరం లేదట, పాలవేను వెళ్ళిపోకుండా వుంటే.

అమ్మ బాబోయ్! పాలుగాని దొరక్కపోతే సాయంత్రం కాఫీ లుండవు. రేపు మజ్జిగ ఉండదు. పోనీ హోటలునుంచి మజ్జిగ తెచ్చుకుందామంటే ఆ హోటలువాడు గ్లాసుడు తెల్ల నీళ్ళు రూపాయికి అమ్ముతాడు. ఇంతకీ రేపటివరకు బతికి బావుంటే మజ్జిగ సంగతి, అసలీ పూట కాఫీ లేకపోతే యింట్లో అందరూ వెర్రికుక్కల్లా కరిచేస్తారు.

"పద" అని లేచి మొల తడువుకున్నాను. తాళాలేవీ?

పరుపులకింద, తలగడలకింద, పిల్లల జేబులు, మూలల్లో ఆట సామాన్లు అన్నీ వెతికేను. అందరి ఇళ్ళ సంగతి నాకు తెలీదు కాని, మా యింట్లో మాత్రం తాళాల వేటకి సగం జీవితం అయిపోతుంది. ఒక్క తాళాలేకాదు-ఏ వస్తువూ పెట్టిన చోట ఉండదు, ఏదీ అవసరానికి కనిపించదు మనుషుల్తో సహా. తాళాలకోసం వెతికితే తువ్వాలు దొరుకుతుంది. తువ్వాలు కోసం వెతికితే జాకెట్ దొరుకుతుంది.

"ఇది ఇల్లా! మాయల మరాఠీ సంసారమా?" అని మా వారు అస్తమానం సణుగుతూనే వుంటారు. అయినా మా ఇంట్లో ఏదో ఒక దానికోసం నిర్విరామ వేట సాగుతూనే ఉంటుంది. ఇంతకీ ఇప్పుడీ తాళాలు దొరుకుతే తప్ప నా కథ నడవదు.

"ఒరే అరుణా! నా తాళాలు కనిపించేయిరా?" అడిగేను.

వాడు వాళ్ళ నాన్నకి అక్షరాలా కొడుకు. అంచేత అడిగిన దానికి సమాధానం చెప్పలేదు సరికదా - "అంటే నీ కోపం కాని అమ్మా, నీ తాళాల కొక ప్లేస్ లేదు. ఎక్కడ పారేసిన అవే. మేకునో, మొలనో పెట్టుకోకూడదూ యిలా అస్తమానం మమ్మల్ని చంపకపోతే" అని నా అశ్రద్ధ గురించి అరగంట లెక్చరిచ్చేడు.

ఈలోగా ఏమిటా కేకలు? భూకంపం వస్తోందా? ప్రళయం వస్తోందా? అదేం కాదట.

నా కూతుళ్ళిద్దరూ బాత్రూమ్‌లోంచి ఒకరు, బైట నుంచి ఒకరు ఖూనీలై పోతున్నారు. "తువాలు మర్చిపోయేను యిమ్మంటుంది" లోపలున్న చిన్నది.

"అసలింతసేపు బాత్రూమ్‌లో కాపురం చేస్తే మిగిలిన వాళ్ళేమైపోవాలి? నాన్నని నీ ఒక్కర్తెకు స్పెషల్ బాత్రూమ్ కట్టించమను" అంటుంది పైనున్న పెద్దది-తువ్వాలు యిస్తాను, యివ్వను అనకుండా. నిజం ఏమిటంటే దానికి తువ్వాలు వెదకడం బద్ధకం. చిన్నప్పుడు చెయ్యి కడుక్కోవడం బద్ధకంవేసి అన్నం తినడం మానేసేది అది.

"వెధవ గోల. ఇది ఇల్లా? జిన్నాటవరు సెంటరా? ఏమిటా కేకలు? ఆడపిల్లలు కారూ? తాళాలు దొరక్క నేను చస్తూవుంటే ఈ కుక్క జెట్టీలేమిటి?" అని యిద్దర్నీ జెమిలిగా నాలుగు తిట్టి తువాలు దానికి, మరో నాలుగు చీవాట్లు దీనికీ యిచ్చి, మళ్ళీ తాళాలవేట కంటిన్యూ చేశాను.

ఈలోగా "ఏమిటమ్మా వెతుకుతున్నావు?" అన్నాడు అక్కడే ఉన్న లల్లూ.

బల్లితోక అయినా కాస్సేపు వదుల్తుందేమో కాని వాడు మాత్రం నన్ను వదలడు.

"తాళాలురా నాన్నా!" అన్నాను.

"ఇలా...ఇలా...గుండ్రంగా ఉంటాయే...నువ్వు బీరువా తీస్తావే...అవా?" అన్నాడు వాడు చేతుల్తో అభినయిస్తూ.

"అవే. నీకు కనిపించాయిరా తల్లీ?" అడిగేడు చిన్ని.

తల గుండ్రంగా తిప్పేడు. "ఎక్కడ?"

"అవీ.. అవీ...నేను...నేను మేడమీంచి కింద విసిరేసేనుకదా?" చంటివెధవ కాబట్టి ఊరుకున్నాను కాని, చాచి లెంపకాయ కొట్టాలనిపించింది.

పాలసీను అయిపోయేక మళ్ళీ మంచం ఎక్కాను. ఈ సారి దేవుడొచ్చినా దిగదల్చుకోలేదు.

దేవుఁడు రాలేదు కాని కోర్టునుంచి జవాను వచ్చాడు యమదూతలా. యమదూతకి చేతిలో పాశం ఉంటుంది. వీడి చేతిలో ఫ్లాస్కుంది. "అయ్యగారు అర్జంటుగా నాలుగు కాఫీ పంపమన్నారు"ట.

పంపమంటారు. ఎందుకు పంపమనరూ? పంపించేవాళ్ళుంటే ఫ్లాస్కుతో కాఫీ ఏం ఖర్మ? బిందెల్తో బీరు పంపమంటారు. ఆ మనిషి అంతే!

"ఛీ - ఛీ! అలాంటి మొగుడు, ఇలాంటి పిల్లలు వున్న నాలాంటివాళ్ళు కథ రాయాలనుకోవడం మహా పాపం" అనుకొని గట్టిగా లెంపలేసుకొని మంచం దిగేసేను. ★